teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 205 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 24 జనవరి 2026 | పేజీలు : 08 | వెల ₹5


Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## తెలంగాణకు మరో అమృత్ భారత్

చర్లపల్లి - తిరువనంతపురం రైలును ప్రారంభించిన ప్రధాని



02









# క్లీన్ మేడారం

## మంత్రి సీతక్క వ్యూహం

- రంగంలోకి 9 వేల మంది సిబ్బంది
- రెండు షిఫ్టుల్లో నిరంతర పర్యవేక్షణ
- 21 మంది డీపీఓలు, 42 మంది డీఎల్పీఓలకు బాధ్యతలు
- వ్యర్థాల సేకరణకు ప్రత్యేక వాహనాల మోహరింపు

వివరాలు 2 లో

ఆసియాలోనే అతిపెద్దఆదివాసీ జాతరగా గుర్తింపు పొందిన సమ్మక్క - సారలమ్మ మహా జాతర-2026 సందర్భంగా కోట్లాది మంది భక్తులు మేడారానికి తరలిరానున్న నేపథ్యంలో, జాతర ప్రాంగణం, మేడారం గ్రామం, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, మహా జాతర నిర్వహణలో కీలకమైన పరిశుభ్రత కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు పంచాయతీ రాజ్ శాఖకు చెందిన వేల మంది సిబ్బందిని రంగంలోకి దింపారు.

### డబ్ల్యూహెచ్‌వో నుంచి

# అమెరికా గుడ్‌బై

## బకాయిలపై పట్టుబట్టిన ప్రపంచ ఆరోగ్య సంస్థ

- రూ. 2 వేల కోట్లు చెల్లిస్తేనే విముక్తి
- ట్రంప్ హయాం నిర్ణయానికి కార్యరూపం
- కొవిడ్ వైఫల్యమే ప్రధాన ఆరోపణ



న్యూ ఢిల్లీ, జనవరి 23 (తీన్మార్ న్యూస్): ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి అమెరికా అధికారికంగా వైదొలిగింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా సిబ్బందిని యూఎస్ వెనక్కి పిలిపించింది. డబ్ల్యూహెచ్‌వోకు అగ్రరాజ్యం రూ.2 వేల కోట్లు బకాయిపడింది. బకాయిలు చెల్లించేవరకు యూఎస్ ఉపసంహరణ పూర్తికాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ తేల్చి చెప్పింది కొవిడ్ మహమ్మారిని అదుపు

మిగతా 2 లో



### మేడారం జాతరకు కేంద్రం

# భారీ ఊతం

- "రూ. 3.70 కోట్ల నిధులు విడుదల"
- మంత్రి కిషన్ రెడ్డి చొరవతో మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ఆర్థికశాఖ
- భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

తెలంగాణ బ్యూరో, జనవరి 23 (తీన్మార్ న్యూస్): మేడారం మహా జాతరకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రూ.3.70 కోట్ల నిధులు కేటాయిస్తూ శుక్రవారం కేంద్ర ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చొరవతో ఈ నిధులను

మిగతా 2 లో

### ఫోన్ ట్యాపింగ్ విచారణకు

# సహకరించా

## కానీ ఇది రాజకీయ వేధింపులే: కేటీఆర్

- లీకుల వ్యవహారంపై కేటీఆర్ ధ్వజం
- సీఎం బంధువులపై కేటీఆర్ సంచలన ఆరోపణలు



హైదరాబాద్, జనవరి 23 (తీన్మార్ న్యూస్): ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు పూర్తిగా సహకరించానని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ నేతల వ్యక్తిత్వ హననానికి బాధ్యులెవరు? అని అధికారులను ప్రశ్నించినట్లు కేటీఆర్ చెప్పారు. లీకులతో

మిగతా 2 లో



### తిరుమల నెయ్యి కల్తీ కేసులో

# ముగిసిన విచారణ

- ఏసీబీ కోర్టులో తుది చార్జిషీట్ దాఖలు
- 12 రాష్ట్రాల్లో ఆధారాలు సేకరించిన సీబీఐ
- 12 మంది పాత్ర ఉన్నట్లు నిర్ధారించిన అధికారులు
- కోర్టు నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి

## అండమాన్ దీవుల పేరును ఆజాద్ హిందూగా మార్చాలి

- ప్రధాని మోడీకి కవిత లేఖ
- నేతాజీకి తెలంగాణ జాగృతి ఘన నివాళి



హైదరాబాద్, జనవరి 23 (తీన్మార్ న్యూస్): నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా తెలంగాణ జాగృతి ప్రధాన కార్యాలయంలో

మిగతా 2 లో



### ప్రభుత్వ ఉద్యోగులకు

# అలర్ట్

- ఏడాది పాటు విధులకు గైర్హాజరైతే ఉద్యోగం ఊస్ట్
- సివిల్ సర్వీసెస్ రూల్స్‌లో సంచలన సవరణలు
- రూల్ 9, రూల్ 25లలో తెలంగాణ సర్కార్ మార్పులు

.. వివరాలు 2లో

### మన శంకర వరప్రసాద్ గారు

# టికెట్ ధర పెంపుపై హైకోర్టు సీరియస్

వాస్తవ గణాంకాలు సమర్పించాలని ఆదేశం



హైదరాబాద్, జనవరి 23 (తీన్మార్ న్యూస్): చిరంజీవి నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం టిక్కెట్ ధరల పెంపు విషయంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ సినిమాకు సంబంధించి ఈ11 జనవరి నుంచి 18 జనవరి వరకు పెంచిన ధరల (సింగిల్ స్క్రీన్‌లకు రూ. 50/-, మల్టీప్లెక్స్‌లకు రూ. 100/- జీఎస్టీతో కలిపి) ప్రకారం విక్రయించిన టికెట్ల వాస్తవ గణాంకాలను సమర్పించాలని

మిగతా 2 లో

### ఫోన్ ట్యాపింగ్ విచారణ

# కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు ఉంది

- కేటీఆర్, హరీశ్‌లను నిందితులా.. బాధితులా..?
- కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్, జనవరి 23 (తీన్మార్ న్యూస్): ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛనివ్వడం లేదని కేంద్ర మంత్రి

మిగతా 2 లో

# రీజినల్ రింగ్ రోడ్డు మా గేమ్ చేంజర్



- 39 రేడియల్ రోడ్లతో నగర రూపురేఖలు మార్చుతాం
- రూ. 250 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం : మంత్రి కోమటిరెడ్డి

05

# క్లీన్ మేడారం

## మంత్రి సీతక్క వ్యూహం



హైదరాబాద్, జనవరి 23 (తీన్మార్ న్యూస్): ఆసియాలోనే అతిపెద్దఆదివాసీ జాతరగా గుర్తింపు పొందిన సమ్మక్క - సారలమ్మ మహా జాతర-2026 సందర్భంగా కోట్లాది మంది భక్తులు మేడారానికి తరలిరానున్న నేపథ్యంలో, జాతర ప్రాంగణం, మేడారం గ్రామం, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, మహా జాతర నిర్వహణలో కీలకమైన పరిశుభ్రత కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు పంచాయతీ రాజ్ శాఖకు చెందిన వేల మంది సిబ్బందిని రంగంలోకి దింపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పరిశుభ్రమైన వాతావరణంలో జాతరను నిర్వహించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోంది.

### బాధ్యతగా కాకుండా సేవగా భావించండి

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, "సమ్మక్క-సారలమ్మ మహా జాతర కోట్లాది భక్తుల విశ్వాసంతో ముడిపడిన మహోన్నత పర్వదినం. ఇలాంటి పవిత్రమైన జాతరలో పరిశుభ్రత, పారిశుధ్యం అత్యంత ముఖ్యమైన అంశం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పరిశుభ్రమైన మేడారాన్ని చూడాలనే ఉద్దేశంతో పంచాయతీ రాజ్ శాఖ సిబ్బందిని పూర్తిస్థాయిలో రంగంలోకి దింపుతున్నాం. ప్రతి అధికారి, సిబ్బంది దీనిని ఒక బాధ్యతగా కాకుండా సేవగా భావించి విధులు నిర్వర్తించాలి" అని పేర్కొన్నారు. మంత్రి ఆదేశాల మేరకు ఇతర జిల్లాల నుంచి అనుభవజ్ఞులైన డీపీవోలు, డీఎల్పీవోలు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులను జోనల్, సబ్‌జోనల్, సెక్టోరల్, సబ్‌సెక్టోరల్ అధికారులుగా నియమించారు. జనవరి 26 నుంచి ఫిబ్రవరి 1 వరకు పంచాయతీ రాజ్ సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లో నిరంతరం విధులు నిర్వహించనున్నారు.

### రాత్రి 10 గంటల వరకు విధులు

పరిశుభ్రత నిర్వహణ కోసం జోనల్ నుంచి సబ్ సెక్టార్ స్థాయి వరకు వందల సంఖ్యలో అధికారులతో పాటు వేలాది మంది కార్మికులు పనిచేయనున్నారు. రెండు



షిఫ్టుల్లో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు విధులు కొనసాగుతాయి. వీరితో పాటు బ్లీచింగ్, స్ప్రేయింగ్, వ్యర్థాల సేకరణ, మీట్ వేస్ట్ మేనేజ్‌మెంట్, డంప్ యార్డుల నిర్వహణ వంటి పనులకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. స్వీపింగ్ వాహనాలు, ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్లు నిరంతరం అందుబాటులో ఉంచేలా ప్రత్యేక బృందాలను నియమించారు.

### మేడారం జాతరను విజయవంతం చేయాలి

గద్దెలు, దేవాలయ ప్రాంగణం, ఎంట్రీ-ఎగ్జిట్ గేట్లు, క్యూ లైన్లు, హరిత హోటల్ ప్రాంతం, ఐటీడీఏ క్యాంపు, చిలుకల గుట్ట, పోలీస్ క్యాంపులు, జంపన్న వాగు పరిసరాలు, బస్టాండ్, వీఐపీ పార్కింగ్ ప్రాంతాలు సహా భక్తుల రాకపోకలు అధికంగా ఉండే అన్ని ప్రాంతాల్లో పంచాయతీ రాజ్ సిబ్బంది పారిశుధ్య నిర్వహణ, ప్రత్యేక పరిశుభ్రత చర్యలు చేపట్టనున్నారు. అందు కోసం జోనల్ ఆఫీసర్లుగా 21 మంది డీపీఓలను, సబ్ జోనల్ ఆఫీసర్లుగా 42 మంది డీఎల్పీఓలను నియమించారు. అలాగే సెక్టార్ ఆఫీసర్లుగా 83 మంది ఎంపీఓలను, సబ్ సెక్టార్ ఆఫీసర్లుగా 480 మంది పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ఫీల్డ్ స్థాయిలో 9 వేల మంది కార్మికులను వినియోగిస్తున్నారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైతే మరింత మంది సిబ్బందిని రంగంలోకి దించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. కోట్లాది మంది భక్తుల ఆరాధనతో, విశ్వాసంతో ముడిపడిన ఈ మహా జాతరలో ప్రత్యేక పరిశుభ్రత చర్యలు చేపట్టి మేడారం జాతరను విజయవంతం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి సీతక్క ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# రీజినల్ రింగ్ రోడ్డు మా గేమ్ చేంజర్



హైదరాబాద్, జనవరి 23 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తమ ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ **2047** అనే స్పష్టమైన విజన్‌తో పనిచేస్తోందని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఏస్ టెక్ **2026** ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. **2047** నాటికి తెలంగాణను వి3 ట్రిలియన్ ఎకానమీగా మార్చడమే తమ టార్గెట్ అన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా జరిగిన గ్లోబల్ సమ్మిట్ లో **5.75**లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్డు మా గేమ్ చేంజర్. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డుకు **39** రేడియల్ రోడ్లు నిర్మాణం చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఐటీ, ఫార్మా, ఏఐ లాంటి పోటీ రంగాలను ప్రోత్సహిస్తున్నాం పెట్టుబడులకు స్వర్గధామంగా హైదరాబాద్ మారుతోందని వెల్లడించారు. హైదరాబాద్ అన్ని రంగాల్లో పురోగమిస్తోంది రియల్ ఎస్టేట్ అద్భుతంగా ఉందన్నారు. ఇటీవల జరిగిన యాక్షన్‌లో ఎకరం **174**కోట్లు పలికిందని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో ఎటు చూసినా భవనాలు కనిపిస్తాయని మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. మిడిల్ క్లాస్, హయ్యర్ మిడిల్ క్లాస్ కుటుంబాలకు అందుబాటు ధరలో సొంతింటి కల నెరవేర్చే విధంగా కృషి చేస్తున్నాం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో సమానంగా అభివృద్ధి చేస్తూ పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన అంశాలపై ప్రధాన దృష్టి సారించాం పొల్యూషన్ ఫ్రీ సిటీ అంశాన్ని దృష్టిలో పెట్టుకున్నాం ఇక్కడ జరిగిన ఇంత మంచి చర్చపై క్యాబినెట్ లో ప్రస్తావిస్తా అని వెల్లడించారు.

# ఫోన్ ట్యాపింగ్ విచారణకు సహకరించా

మొదటి పేజీ తరువాయి



తమకు సంబంధం లేదని అధికారులు చెప్పినట్లు తెలిపారు. ప్రతిపక్ష పార్టీగా తాము బాధ్యతగా ఉంటాం. ఎన్నిసార్లు విచారణల పేరుతో వేధించినా తట్టుకుంటాం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు. ఎవరికీ భయపడం అని వెల్లడించారు. హీరోయిన్ల చుట్టూ జరుగుతున్న ప్రచారం నిజం కాదని స్వయంగా పోలీసులే స్పష్టం చేశారు. అయినా రాజకీయ స్వలాభం కోసం మంత్రులు ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. సింగరేణి టెండర్లలో దొంగలు దొరికారు ఆధారాలతో హరీష్ రావు బయటపెట్టినా ఇప్పటివరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. స్వయంగా మంత్రి కుమారుడు గుండాగిరి చేస్తున్నా చర్యలు లేవు అక్కడ సిట్ కూడా లేదని అన్నారు. బొగ్గు కుంభకోణం కేసులో సీఎం రేవంత్ రెడ్డి బావమరిది కింగ్ పిన్ అని అని ఆధారాలు ఉన్నాయి. చర్యలు తీసుకునే దమ్ము ప్రభుత్వానికి ఉన్నదా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

### మా ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారా?

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు విచారణకు పిలిచి అడిగిన ప్రశ్నలే అడిగి వేధిస్తున్నారు. అధికారులు సైతం ఈ కేసుతో టైంపాస్ చేస్తున్నారు. లోపల ఏదో జరిగిపోతోందని ప్రచారం చేశారు. మా ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారా? లేదా? అని అడిగితే అధికారులు సమాధానం చెప్పకుండా దాటవేశారు. సెలక్టివ్‌గా లీకులు ఇచ్చి తప్పుడు ప్రచారం చేశారు. ఆ అర్రలో(గదిలో) ఆరుగురమే ఉన్నాం. అధికారులు, నేను తప్పా ఎవరూ లేరు. అక్కడి విషయాలు బయటకు ఎలా వెళ్తున్నాయి. దీనిని ప్రజలు గమనించాలని కేటీఆర్ కోరారు.

# ఫోన్ ట్యాపింగ్ విచారణ "కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు ఉంది"

మొదటి పేజీ తరువాయి

బండి సంజయ్ అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ కేసులో కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తూనే ఉన్నారని మండిపడ్డారు.

### ఆ విషయంలో ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలి.

రాష్ట్ర ప్రభుత్వంలోని కొంతమంది పెద్దలు చెప్పిన విధంగానే సిట్ అధికారులు వ్యవహరించాలని ఒత్తిడి పెరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. సిట్‌లోని అధికారులు చాలా సిన్సియర్, పవర్‌ఫుల్ అని, వారి మీద తమకు ఎలాంటి అనుమానాలు లేవన్నారు. కానీ కేసు విచారణలో వారికి ఎంత స్వేచ్ఛనిచ్చారనే దానిపై అనుమానాలు వస్తున్నాయని అన్నారు. అసలు ఈ కేసులో హరీశ్ రావు, కేటీఆర్‌లు అందరి ఫోన్లను ట్యాపింగ్ చేశారని విచారణకు పిలిచారా లేక వారి ఫోన్లు ట్యాప్ అయ్యాయని విచారిస్తున్నారా అనే విషయాన్ని సిట్ అధికారులు స్పష్టం చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సిరిసిల్ల వేదికగా ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకుని ఫోన్ ట్యాపింగ్ దందాకు తెరలేపారని ఆక్షేపించారు. కేసీఆర్ కూతురే తన ఫోన్ ట్యాప్ అయిందని చెప్పిందని ట్యాపింగ్‌కి భయపడి ఓ ఏడాది హరీష్‌రావు, కవిత దంపతులు కూడా ఫోన్లు వాడలేదన్నారు. కేసీఆర్ హయాంలో బిచ్చగాళ్లు కూడా వాట్సాప్ కాల్ మాట్లాడాల్సిన పరిస్థితి ఉండేదని అన్నారు. ఈ కేసులో తనకు కూడా సిట్ నోటీసులు ఇచ్చి వాంగ్మూలం తీసుకుందని బండి సంజయ్ అన్నారు.



### అది జగమెరిగిన సత్యమే.. కదా!

ఫోన్ ట్యాపింగ్ ద్వారా గత పదేళ్ల కాలంలో వేల కోట్ల రూపాయల లావాదేవీలు జరిగాయని బండి సంజయ్ ఆరోపించారు. ఇందులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రముఖ బిజినెస్‌మెన్లు, రాజకీయ నాయకులు, సినిమా సెలబ్రిటీలు, జడ్జీలు బాధితులనేది జగమెరిగిన సత్యమే కదా అని అన్నారు. కేసీఆర్ కుటుంబమే ఫోన్లు ట్యాప్ చేయించిందని తెలిసినా ఇప్పటి వరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులో ప్రధాన నిందితుడు, ఎసబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును అరెస్ట్ చేసేందుకు ప్రభుత్వం ఎందుకు ధైర్యం చేయడం లేదని ప్రశ్నించారు. ఈ సిట్ విచారణను ఎలా నమ్మమంటారు? ఇప్పటివరకు ఏం సాధించారో చెప్పాలన్నారు. ప్రభుత్వంపై వస్తున్న అవినీతి ఆరోపణలను డైవర్ట్ చేసేందుకు ఫోన్ ట్యాపింగ్ కేసును కాంగ్రెస్ ప్రభుత్వం ఆయుధంగా వాడుకుంటోందని బండి సంజయ్ విమర్శించారు.

# డబ్ల్యూహెచ్‌వో నుంచి అమెరికా గుడ్‌బై



మొదటి పేజీ తరువాయి

చేయడంలో, సంస్కరణలను అమలుచేయడంలో డబ్ల్యూహెచ్‌వో విఫలమైందంటూ యూఎస్ ఆరోగ్య, మానవ సేవల విభాగం ఆరోపించింది. సభ్య దేశాల రాజకీయ ప్రభావం కూడా కారణమేనని తెలిపింది. ఇకపై డబ్ల్యూహెచ్‌వోకు అమెరికా నుంచి వచ్చే అన్ని రకాల నిధులు నిలిపివేస్తున్నామని స్పష్టం చేసింది. డబ్ల్యూహెచ్‌వోకు సంబంధించిన సాంకేతిక కమిటీలు, వర్కింగ్ గ్రూపుల నుంచి కూడా వైదొలుగుతున్నట్లు యూఎస్ పేర్కొంది. అయితే, డబ్ల్యూహెచ్‌వో అమెరికా ఆరోపణలను తోసిపుచ్చింది. ఈ ఉపసంహరణ అమెరికాకే కాకుండా ప్రపంచ మొత్తానికి ఒక నష్టమని సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనామ్ గెబ్రియేసస్ పేర్కొన్నారు. సంస్థ నుంచి వైదొలుగుతున్నట్లు అమెరికా చెప్పగానే సరిపోదని సంస్థకు బకాయిపడిన 260 మిలియన్ డాలర్లను చెల్లించేవరకు డబ్ల్యూహెచ్‌వో నుంచి యూఎస్ ఉపసంహరణ సాధ్యం కాదని డబ్ల్యూహెచ్‌వో పేర్కొంది. మరోవైపు, ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెల్లించాల్సిన బకాయిలపై అమెరికా అధికారిక వర్గాలు స్పందిస్తూ సంస్థ నుంచి వైదొలగడానికి ముందు బకాయిలను పూర్తిగా చెల్లించాలనే చట్టబద్ధమైన నియవ-ఁమేమీ లేదంటూ కొట్టిపారేశాయి. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు సందర్భాల్లో ఆ సంస్థ నుంచి వైదొలుగుతామని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఏడాది క్రితమే ట్రంప్ ఈ ఉపసంహరణకు సంబంధించిన కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు.

# మేడారం జాతరకు కేంద్రం భారీ ఊతం


మొదటి పేజీ తరువాయి

కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా మంజూరు చేశాయి. రెండేళ్లకు ఒకసారి నిర్వహించే మేడారం జాతరకు దేశ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు తరలివస్తుండటంతో భక్తులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఈ నిధులను విడుదల చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. సమ్మక్క - సారలమ్మల జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతర గిరిజన సంప్రదాయాలు, విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తోంది. ప్రతి జాతరతో భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం నిరంతరంగా సహకారం అందించడం గిరిజన సంస్కృతి పరిరక్షణకు తోడ్పడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# తిరుమల నెయ్యి కల్తీ కేసులో "ముగిసిన విచారణ"

తెలంగాణ బ్యూరో, జనవరి 23 (తీన్మార్ న్యూస్): నెయ్యి కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో సిట్ విచారణ ముగిసింది. గత ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూలో వినియోగించిన నెయ్యి కల్తీ అయిందని ఆరోపణలు రావడంతో కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ మేరకు సిట్‌ను ఏర్పాటు చేసింది. అయితే సిట్‌పై అభ్యంతరాలు రావడంతో సీబీఐ నేతృత్వంలో అధికారులు విచారణ కొనసాగించారు. 15 నెలల పాటు 12 రాష్ట్రాల్లో విచారణ సాగింది. మొత్తం 24 మందిని నిందితులను గుర్తించారు. మరో 12 మంది పాత్ర ఉన్నట్లు నిర్ధారించారు. బోలె బాబా ఆర్గానిక్ డెయిరీ డైరెక్టర్లు, పామిల్, విపిన్ జైన్‌లు కీలక సూత్రధారులుగా గుర్తించారు. విచారణ ముగియడంతో తాజాగా నెల్లూరు ఏసీబీ కోర్టులో తుది చార్జిషీట్ దాఖలు చేశారు. దీంతో కోర్టు తీర్పుపై ఉత్కంఠ నెలకొంది.

# ప్రభుత్వ ఉద్యోగులకు అలర్ట్



తెలంగాణ బ్యూరో, జనవరి 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగుల నిబంధనల్లో సంచలన మార్పులు తీసుకొచ్చింది. దీంతో, ప్రభుత్వ ఉద్యోగులు ఏడాదికి పైగా అనధికార గైర్హాజరు అయితే ఉద్యోగం కోల్పోయే విధంగా రూల్స్‌లో పలు సవరణలు చేసింది. వివరాల మేరకు తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగుల నిబంధనల్లోని సివిల్ సర్వీసెస్ రూల్స్‌లో రూల్ 9, రూల్ 25కి సవరణలు చేసింది. ఈ క్రమంలో ఏడాదికి పైగా అనధికార గైర్హాజరు అయితే ఉద్యోగం కోల్పోయే అవకాశం ఉంది. అలాగే, ఐదేళ్లకు మించి నిరంతర గైర్హాజరు అయితే సేవల నుంచి తొలగించే విధంగా సవరణ జరిగింది. ఇక, ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశీ టూర్ వెళ్లినా చర్యలు తీసుకునే విధంగా మార్పులు చేశారు. అయితే, చర్యలకు ముందు ఉద్యోగికి షోకాజ్ నోటీసు తప్పనిసరి అని నిబంధనల్లో పేర్కొన్నారు.

# తెలంగాణకు మరో అమృత్ భారత్

తెలంగాణ బ్యూరో, జనవరి 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రజలకు అమృత్ భారత్ 2.0 ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి వచ్చింది. కేరళలోని తిరువనంతపురం నుంచి చర్లపల్లి మధ్య రాకపోకలు సాగించే ఈట్రైన్‌ను శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా ప్రారంభించారు. దీనితో పాటు మరో ప్యాసింజర్ రైలుతో సహా నాలుగు కొత్త రైలు సేవలను జెండా ఊపి ప్రారంభించారు. కాగా తెలంగాణలో ఇప్పటికే చర్లపల్లి-ముజఫర్‌పూర్ (బిహార్) మధ్య ఒక అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రాకపోకలు సాగిస్తోంది. తాజాగా అమృత్ భారత్ 2.0 రైలు (నం.17041) ప్రతి మంగళవారం ఉదయం 7.15 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు బుధవారం మధ్యాహ్నం 2.45 గంటలకు తిరువనంతపురం చేరుకుంటుంది. తిరిగి అదేరోజు సాయంత్రం 5.30 గంటలకు తిరువనంతపురం నుంచి రైలు (నంబరు 17042) బయలుదేరి గురువారం రాత్రి 11.30 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుందని అధికారులు తెలిపారు.

# అధికారులు సిద్ధంగా ఉండాలి

### 26న విధులు నిర్వహించే అధికారులు రిపోర్ట్ చేయాలి

### ముగిసిన సెక్టోరల్ అధికారుల శిక్షణ కార్యక్రమం

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్




ములుగు జిల్లా, జనవరి 23 (తీన్మార్ న్యూస్): మేడారం మహా జాతరకు వచ్చే సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిబద్ధత, అంకితభావంతో పనిచేసి, మేడారం జాతరను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలోని డి.ఎల్.ఆర్. గార్డెన్ లో మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర 2026 విధులకు కేటాయించబడిన సెక్టోరల్ అధికారులు, సిబ్బందికి రెండవ విడత శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతరలో విధులు నిర్వహించే అధికారులకు శిక్షణా నేటితో ముగిసింది అని అధికారులు జాతర విధులలో పాల్గొనడానికి సిద్దంగా ఉండాలి అని అన్నారు. జాతర విజయవంతానికి అధికారులు కృషి చేయాలని భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలని తెలిపారు. జంపన్నవాగు వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏ మాత్రం విధులలో ఏమ-రుపాటుగా వ్యవహరించరాదని తెలిపారు. జాతర పరిసరాల్లో భక్తులకు అర్థమయ్యేలా ఆర్ అండ్ బి శాఖవారు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జనసముహంలో పారిశుధ్య నిర్వహణ నిరంతరం 24 గంటలు చేయాలన్నారు. దుర్వాసన రాకుండా ఎప్పటికప్పుడు గల్ఫర్ తో శుభ్రం చేస్తుండాలన్నారు. జాతర చుట్టూ 5 కి.మీ. పరిధిలో అన్ని ఏర్పాట్లు చేయాలని, పారిశుద్ధ్యాన్ని పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. పారిశుధ్య సిబ్బందికి యూనిఫాం, గ్లౌజ్ లు, మాస్కులు ఇవ్వాలన్నారు. అన్ని పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆరోగ్య పరంగా మందులు అందుబాటులో పెట్టుకొని సర్వ సన్నద్ధంగా ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆలయ అలంకరణ, లైటింగ్, పరిసరాలు గిరిజన సంస్కృతి, సాంప్రదాయాల ప్రకారం జాతర నిర్వహించాలని అన్నారు. ఇంజనీరింగ్, పారిశుధ్య సిబ్బంది సమర్ధవంతంగా పనిచేయాలన్నారు. శాఖలవారు సెక్టార్లను అంతర్గతంగా విభజించి, సిబ్బందికి షిఫ్టులవారీగా విధులు అప్పజెప్పాలన్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని అమలుచేయాలని అన్నారు. జాతరలో పేపర్, క్లాత్, జూట్ సంచులను వాడాలన్నారు. గద్దెల వద్ద విధులు నిర్వర్తించే వారు సహనం కోల్పోకుండా భక్తులకు సేవాలందించాలన్నారు. జాతర నిర్వహణ ప్రతిసారి ఒక ఛాలెంజ్ గా తీసుకోవాలని, గతం కంటే మెరుగైన సేవలు అందించాలని, సెక్టార్ అధికారులది జాతర నిర్వహణలో కీలకమైన పాత్ర అని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి సెక్టార్ లో త్రాగునీరు, టాయిలెట్లు తదితర కనీస సౌకర్యాలు వుండేలా, సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులు, సిబ్బంది తమ తమ విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అనంతరం అధికారులకు జాతర విధులకు సంబంధించి ప్రత్యేక గుర్తింపు కార్డ్స్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, నోడల్ అధికారులు, జిల్లా అధికారులు, ఇతర సెక్టోరల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# సొసైటీ గోదాంల స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి



ఆత్మకూరు, జనవరి 23 (తీన్మార్ న్యూస్): శుక్రవారం ఆత్మకూరు మండలం పెద్దాపురం గ్రామంలో పిఏసిఎస్ పెద్దాపురం సొసైటీ గోదాంల కొరకు అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సొసైటీ గోదాంల నిర్మాణానికి అవసరమైన అన్ని అనుమతులు త్వరితగతిన పూర్తి చేసి గోదాంల నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్మిస్తున్న సోలార్ ప్లాంట్ కు సంబంధించిన భూములను అధికారులతో కలిసి పరిశీలించారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి**



ములుగు జిల్లా, జనవరి 23 (తీన్మార్ న్యూస్): గణతంత్ర దినోత్సవ వేడుకలకు అంగరంగ వైభవంగా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి. అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావుతో కలసి వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించాలని వాటికి సంబంధించిన ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వేడుకలను కలెక్టరేట్ లో నిర్వహించాలని నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డి ఎం అండ్ హెచ్ ఓ గోపాలరావు, డిసి ఎస్ ఓ షా ఫైజల్ హుస్సేని, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డి సి ఓ సర్దార్ సింగ్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియమాలు జాగ్రత్తలపై అవగాహన



మహబూబాబాద్ జిల్లా, జనవరి 23 (తీన్మార్ న్యూస్): రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని మహబూబాబాద్ పట్టణంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల మోదుగులగూడెం పిల్లలకు రోడ్ సేఫ్టీ భద్రత ట్రాఫిక్ నియమాలు పాటించవలసిన జాగ్రత్తలపై జిల్లా రవాణా శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పక్కగా పాటించడం, జీబ్రా క్రాసింగ్ లను వినియోగించడం, ట్రాఫిక్ సిగ్నల్ అనుసరించడం, వాహనాలను ఓవర్టేక్ చేయడం, రోడ్డు ప్రమాదాల నివారణకు పక్కాగా పాటించవలసిన అంశాలు సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక దూరం ప్రయాణించినప్పుడు విశ్రాంతి తీసుకోవడం, శీతాకాలం వర్షాకాలంలలో రోడ్డుపై ప్రయాణించే సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర అంశాలపై పిల్లలకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, తేదీ జనవరి 1 నుండి 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరు బాధ్యతయూతంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ వెంకట్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌లో చేరిన పోలేపాక ఆంద్రయ్య, పోలేపాక సదయ్య

**చల్లా ధర్మారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిక**



హనుమకొండ, జనవరి 23 (తీన్మార్ న్యూస్): దామెర మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలేపాక ఆంద్రయ్య, పోలేపాక సదయ్యలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బిఆరఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, గ్రామాల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్లే కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో నమ్మకం కోల్పోయిందని చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆరఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి

### మత్తు పదార్థాల రవాణా వాడకంపై చర్యలు తీసుకోవాలి

### విద్యాసంస్థలు బహిరంగ ప్రదేశాలలో ప్రచారం కల్పించాలి

### జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్.



మహబూబాబాద్ జిల్లా, జనవరి 23 (తీన్మార్ న్యూస్): శుక్రవారం కలెక్టరేట్ ఎనసి సమావేశ మందిరంలో జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి కిరణ్ కుమార్, జిల్లా పరిషత్ సీఈవో పురుషోత్తం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని సరిత, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మదార్, సంబంధిత అధికారులతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు పక్కా కార్యా చరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ యంత్రణ కోసం చేపట్టిన చర్యలపై జిల్లా స్థాయి నార్కోటిక్, నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదు అవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల వాడకం నివా రణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచా రం వంటి అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాల రవాణా, సాగు వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సెలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటవీశాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని ఆసు పత్రులు, మెడికల్ దుకాణాల్లో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని సూచిం చారు. చెడు అలవాట్లు వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాలలో మాదకద్రవ్యాల నిరోధక చర్యలు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు, సంస్కృతిక సారధి సభ్యులచే,

సోషల్ మీడియా ప్రింటర్ ఎలక్ట్రానిక్ ప్రతినిధుల ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. ఇంటెలిజెన్స్ విభాగం వారు ఆర్టీసీ బస్సులు, ట్రైన్స్ తదితర ప్రదేశాలలో నిత్యం తనిఖీలు నిర్వహించి నిఘా పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ చిరంజీవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీను, కలెక్టరేట్ సూపరిండెంట్ రాజేష్, డాక్టర్ శ్రావణ్, సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు



పినపాక, జనవరి 23 (తీన్మార్ న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజా భవన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పినపాక మండలానికి చెందిన కళ్యాణ లక్ష్మి -- షాది ముబారక్ పథకాల లబ్ధిదారులకు మొత్తం రూ.4 లక్షల రూపాయల విలువైన చెక్కులను పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన సూర్య



వెంకటాపూర్, జనవరి 23 (తీన్మార్ న్యూస్): వెంకటాపూర్ (రామప్ప) మండలంలోని,జవహర్ నగర్ గ్రామానికి చెందిన త్రికోవేల.నారాయణ ఇటీవలే అనారోగ్యంతో మరణించగా, వారి కుటుంబాన్ని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుంజా.సూర్య పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పి, ఆర్థికసాయం అందచేసి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మారం.సుమన్ రెడ్డి,మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు రుద్రారపు.మమత, మండల యూత్ ఉపాధ్యక్షులు-కాసర్ల.రాజు, గ్రామ సర్పంచ్-భానోత్ జెల్ సింగ్, ఉప సర్పంచ్-తిరుపతి.కృష్ణ, గ్రామ అధ్యక్షుడు-సరసాని.రవీందర్ రెడ్డి, జిల్లా యూత్ నాయకులు-తిరుపతి (మొండయ్య), అప్పిడి.మహిపాల్ రెడ్డి,మేకల.రాజేష్, సందీప్ తదితరులు నాయకులు పాల్గొన్నారు.

# వరద కాలువల పనులు నిలిపివేత ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం

## మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



గీసుకొండ, జనవరి 23 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ వరద కాలువలు బలోపేతం చేయడం అనే అత్యంత కీలకమైన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిపివేయడం దురదృష్టకరమని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఈ పనులకు పరిశ్రమల శాఖ ద్వారా జీఓ నెం.167 ప్రకారం రూ.160.92 కోట్ల పరిపాలనా ఆమోదం ఇచ్చి, టెండర్లు ఆహ్వానించి పనులు కూడా ప్రారంభించారని గుర్తు చేశారు. వర్షాకాలంలో వరద ముంపును నివారించేందుకు అత్యంత అవసరమైన ఈ ప్రాజెక్టు గత రెండు వర్షాకాలాల్లో టెక్స్టైల్ పార్క్ పూర్తిగా మునిగిపోవడంతో మరింత ప్రాధాన్యత సంతరించుకుందని తెలిపారు.

భవిష్యత్తులో భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని, ఇప్పటికే పరిశ్రమల సిబ్బంది వరదల భయంతో ఆందోళన చెందుతున్నారని, కొత్తగా పరిశ్రమలు రావాలంటే భయపడుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో పనులను నిలిపివేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి, అసమర్థతకు అద్దం పడుతోందని మండిపడ్డారు.

ఇప్పటివరకు హెడ్ అఫ్ అకౌంట్ వివరాలు అందించకపోవడం వల్లనే పనులు ఆగిపోయాయని చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని విమర్శించారు. గత ఏడాది గొప్పలకు వెళ్లి, టెండర్ పేరుతో ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసి, ఇప్పుడు ఫండ్స్ లేవని పనులు ఆపేసే ప్రభుత్వాన్ని ప్రజలు చూస్తున్నారు అని అన్నారు. టెక్స్టైల్ పార్క్లో జరిగిన ఈ ఘటన కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనకు ప్రత్యక్ష ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. పరిశ్రమల భద్రత, వేలాది కార్మికుల ఉపాధి, ప్రాంత అభివృద్ధిని తాకట్టు పెట్టే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా కళ్లుతెరచి, వెంటనే నిధులు విడుదల చేసి, వరద కాలువల బలోపేత పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, లేదంటే పరిశ్రమల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టిన బాధ్యత ప్రభుత్వానిదే అవుతుందని చల్లా ధర్మారెడ్డి హెచ్చరించారు.

### యంగ్ వన్ కంపెనీని సందర్శించిన చల్లా ధర్మారెడ్డి

కాకతీయ మెగా వస్త్ర పరిశ్రమలో ఉన్న యంగ్ వన్ కంపెనీని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కంపెనీ యాజమాన్యంతో కలిసి పరిశ్రమలో కొనసాగుతున్న ఉత్పత్తి ప్రక్రియలు, కార్మికులకు కల్పిస్తున్న సదుపాయాలు, ఉపాధి అవకాశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పార్కు ఏర్పాటుకోసం భూములు ఇచ్చిన కుటుంబాలకు,స్థానికులకు ఉపాధి అవకాశాలలో మొదటి ప్రాధాన్యత కల్పించాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంగెం, గీసుగొండ మండలాల బిఆరస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణా ముగింపు సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్



వరంగల్ జిల్లా, జనవరి 23 (తీన్మార్ న్యూస్): వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాలకు చెందిన కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల వార్డెన్ల సాధికారత లక్ష్యంగా జనవరి 19 నుండి 23, వరకు హనుమకొండ జిల్లా నక్కలగుట్టలోని హోటల్ హరిత కాకతీయలో ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఈ శిక్షణా కార్యక్రమం ముగింపు సమావేశానికి వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ముఖ్య అతిథిగా హాజరై, శిక్షణ పొందిన వార్డెన్లతో పరస్పరంగా మాట్లాడి వారి అనుభవాలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, స్పెషల్ ఆఫీసర్, కేర్‌టేకర్‌గా పని చేయడం కేవలం ఉద్యోగం మాత్రమే కాదు, అది ఒక గొప్ప సేవఅని, బాలికల భవిష్యత్తును తీర్చిదిద్దే కీలక బాధ్యతను నిర్వర్తిస్తున్నారని వార్డెన్లను అభినందించారు. నేటి తరం పిల్లలు భావోద్వేగంగా సున్నితంగా ఉంటారని, వారితో వ్యవహరించేటప్పుడు అధిక సహనం, సానుభూతి అవసరమని కలెక్టర్ సూచించారు. బాలికలు సరైన ఆహారం తీసుకోకపోతే భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొంటూ, వారి ఆరోగ్యం, పోషణ, భద్రత మరియు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పెషల్ ఆఫీసర్లు, కేర్‌టేకర్లకు సూచించారు. బాలికలను సొంత పిల్లల మాదిరిగా చూసుకుంటూ వారి భౌతిక, మానసిక, భావోద్వేగ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని తెలిపారు. ప్రతి ప్రాణం విలువైనది. బాలికలను కంటికి రెప్పలా కాపాడటం మీ ప్రధాన బాధ్యత అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా వార్డెన్లకు అందించిన అవగాహన, నైపుణ్యాలు వారి సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి వరంగల్ రంగయ్య నాయుడు, జిసిడిఓ లు కె. ఫ్లోరెన్స్, సునీత, వరంగల్ జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ సుజన తేజ, మాస్టర్ ట్రైనర్ కరీంనగర్ కృపారాణి, జ్యోతి, సరస్వతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటర్ ఓటు హక్కు వినియోగించుకోవాలి

## జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



హన్మకొండ జిల్లా, జనవరి 23 (తీన్మార్ న్యూస్): ప్రజాస్వామ్యంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటర్ గా తమ పేరు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పిలుపునిచ్చారు. ఈ నెల 25న 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, సిబ్బందితో కలెక్టర్ స్నేహ శబరీష్, ఓటర్లతో దేశ పౌరులుగా మేము ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతాం. కులం, మతం, జాతి, వర్గం, భాషాపరమైన ఒత్తిళ్లకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తాం' అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేసేందుకు, ఆయా ఎన్నికల్లో అత్యధిక ఓటర్లు ఓటును సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించేందుకు జాతీయ ఎన్నికల సంఘం 2011 నుంచి ప్రతి ఏటా జనవరి 25ను జాతీయ ఓటర్ల నిర్వహిస్తోందన్నారు. దినోత్సవాన్ని ప్రజాస్వామ్య దేశంలో అందరికీ ఆమోదయోగ్యమైన, ఎక్కువ మంది ఆదరణను పొందిన పాలకులను మన ప్రజాప్రతినిధులుగా ఎన్నుకునేందుకు ఓటు హక్కు కల్పించడం జరిగిందన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యత గురించి గతంలో ప్రజలకు చాలా తక్కువగా అవగాహన ఉండేదని, ప్రస్తుతం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నందున ప్రతి పౌరుడు ఓటు విశిష్టతను తెలుసుకొనేందుకు అవకాశం కలిగిందన్నారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదనవు కలెక్టర్ రవి, డిఆర్డిఓ మేన శ్రీను, అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, పాల్గొన్నారు.



# మేడారం వెళ్లే భక్తులకు రవాణా సౌకర్యంలో ఇబ్బందులు ఉండొద్దు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 23 (తీన్మార్ న్యూస్): మేడారం జాతరకు వెళ్లే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కాటారం నుండి మహా ముత్తారం వరకు, భూపాలపల్లి నుండి గొల్ల బుద్దారం వరకు ఉన్న ఆర్ అండ్ బి రహదారుల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారుల మరమ్మత్తులు, గుంతల పూడ్చివేత, రోడ్డు వెడల్పు, సైన్‌బోర్డుల ఏర్పాటు, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కమలాపూర్‌లో జరుగనున్న మినీ మేడారం జాతర ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు అవసరమైన తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, పారిశుధ్యం, పార్కింగ్ సౌకర్యాలు సమృద్ధిగా కల్పించాలని, భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. జాతర సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రవాణా నియంత్రణ, ట్రాఫిక్ మళ్లింపు ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేయాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. మినీ మేడారం ఆలయ పూజారులకు భవన నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని సంబంధిత శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. భవన నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి రమేష్, తహసీల్దార్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాభ్యాసం చేయిస్తున్న కరస్పాండెంట్ నర్సయ్య

## అరవింద స్కూల్లో ఘనంగా వసంత పంచమి వేడుకలు



ఖిలావరంగల్, జనవరి 23 (తీన్మార్ న్యూస్): అక్షరానికి ఆదిదేవతైన చదువుల తల్లి సరస్వతి దేవి పుట్టినరోజు సందర్భంగా నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేటలో గల అరవింద పబ్లిక్ స్కూల్ లో శుక్రవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ పంచకం నర్సయ్య శ్రీ సరస్వతి దేవి చిత్ర పటానికి పూలమాల వేసి విద్యార్థినీ, విద్యార్థులకు చక్కటి క్రమశిక్షణతో పాటు మంచి జ్ఞానాన్ని ప్రసాదించాలని అమ్మవారిని ప్రార్థించారు. విద్యార్థులు వారి పుస్తకాలు, పెన్నులను శ్రీ సరస్వతీ దేవి వద్ద ఉంచి సరస్వతి మాత ఆశీర్వాదాలు పొందారు. అనంతరం చిన్నపిల్లలకు అక్షరాభ్యాసం చేయించడం జరిగింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నర్సయ్య మాట్లాడుతూ వసంతం అనగా నూతనమైనది, వసంత పంచమి మాఘ మాసంలో శుక్ల పక్షం పంచమి రోజున వస్తుందని అన్నారు. వసంత పంచమి రోజున విద్య, జ్ఞానం, కళలకు అధిదేవతైన శ్రీ సరస్వతి దేవిని భక్తితో పూజిస్తారు. విద్యార్థులు పుస్తకాలు, పెన్నులు, వాయిద్యాలు దేవి ఎదుట ఉంచి జ్ఞానాన్ని, మంచి ఆలోచనలను, ప్రసాదించమని ఆశీర్వాదాలు కోరుకుంటారని తెలిపారు. వసంత పంచమి విద్యకు, సంస్కృతికి, ప్రకృతికి ప్రాధాన్యం చాటే అందమైన పండుగ, ఈ పండుగ మనకు కొత్త ఆశలు, కొత్త ఆలోచనలు, సానుకూల దృక్పథాన్ని అందిస్తుంది. ఈ రోజు నుంచి వసంత ఋతువు ప్రారంభమవుతుందని భావిస్తారు. ప్రకృతి పచ్చదనంతో కళకళలాడుతూ, పుష్పాలు వికసించి, చల్లని వాతావరణం మనసును ఆనందింపజేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాల్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మేడారం జాతర రహదారి ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



భూపాలపల్లి, జనవరి 23 (తీన్మార్ న్యూస్): మేడారం జాతర సందర్భంగా భక్తుల రాకపోకల సౌలభ్యం మరియు భద్రతను దృష్టిలో ఉంచుకుని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ శ్రీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ నార్లాపూర్ నుండి భూపాలపల్లి మరియు నార్లపూర్ నుండి కాల్వపెల్లి మీదుగా కాటారం వరకు ఎగ్జిట్ మార్గాన్ని పరిశీలించారు. జాతర నుంచి తిరిగి వచ్చే వాహనాలు సాఫీగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రయాణించేలా రహదారి పరిస్థితులను పరిశీలించి, అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా, జాతర విధుల్లో పాల్గొనే పోలీస్ సిబ్బందికి మెస్ సౌకర్యాలు, నివాస ఏర్పాట్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమర్థవంతంగా ఉండేలా చూడాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మేడారం నుంచి నార్లాపూర్ మీదుగా భూపాలపల్లి వచ్చే మార్గంలో మూల మలుపులు అధికంగా ఉన్నందున వాహనదారులు అత్యంత జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. మూల మలుపుల వద్ద వాహనదారులకు ముందుగా హెచ్చరికలు అందించేలా అవసరమైన ఇండికేషన్ బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే జాతర సమయంలో పశువులను, రోడ్లపైకి రాకుండా చూడాలని వాటివల్ల రోడ్డు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున వాటిని రాకుండా చూడాలని ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు. జాతర సందర్భంగా రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ప్రమాదాల నివారణకు భక్తులు మరియు వాహనదారులు పోలీస్ సిబ్బందికి సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.

# చట్టాన్ని అతిక్రమిస్తే వదిలిపెట్టం

### రిటైర్మెంట్ తర్వాత కూడా విచారణ తప్పదు

### అధికారులకు హరీశ్ రావు హెచ్చరిక



హైదరాబాద్, జనవరి 23 (తీన్మార్ న్యూస్): ఫోన్ ట్యాపింగ్ కేసులో రిటైర్మెంట్‌కు దగ్గర ఉన్న అధికారులతో సిట్ ఏర్పాటు చేసి మమ్మల్ని ఇబ్బందులు పెడుతున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. దావోస్ నుంచి సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్న మాటలు, మీ సీపీ మాటలు విని మమ్మల్ని ఇబ్బందులకు గురి చేసేలా చట్టాన్ని అతిక్రమించి పని చేసే అధికారులు, పోలీసులను రిటైర్మెంట్ తర్వాత కూడా వదిలిపెట్టమని హెచ్చరించారు. అధికారులు అన్యాయంగా, అక్రమంగా వ్యవహరిస్తే, ఉద్దేశ్యపూర్వకంగా ఇబ్బంది పెట్టాలని ప్రయత్నం చేస్తే మీరు ఏ పొక్కలో దాక్కున్నా, సప్త సముద్రాల అవతల ఉన్నా పట్టుకొచ్చి విచారిస్తామన్నారు. శుక్రవారం బీఆర⎕స్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను సిట్ విచారణ నేపథ్యంలో జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు రేపు అధికారంలో రాబోయేది బీఆర⎕స్ ప్రభుత్వమేనని అప్పుడు మీకు ప్రభుత్వం ఏ మాత్రం సహకరించదని మీ సొంత డబ్బులతో, సొంత లాయర్లను పెట్టుకొని కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు.

#### లీకులొద్దు

కొంత మంది అధికారులు తప్పుడు లీకులు ఇస్తున్నారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి లీకువీరులను వదిలిపెట్టేది లేదు. అంతకు అంత అనుభవిస్తారు. జాగ్రత్త ఆలోచించుకోవాలన్నారు. ఉద్దేశ్యపూర్వకంగా ప్రభుత్వం బీఆరస్ నేతలపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం దుర్మార్గం అన్నారు. కుట్రలతో బీఆరస్ నాయకులను బెదిరించాలని చూస్తున్న రేవంత్ పన్నాగం ఇది అన్నారు. మేం తప్పు చేయలేదు, ఎవరికి భయపడేది లేదని కేటీఆర్ దైర్యంగా విచారణకు వెళ్లారని చెప్పారు. అనేక సందర్భాల్లో బీఆర⎕స్ నాయకులపై దుష్ప్రచారం జరిగింది. ఆరోజు ఎందుకు కేసులు పెట్టలేదు. మహిళల ఆత్మాభిమానం దెబ్బతీస్తే, కేటీఆర్ మీద సోషల్ మీడియాలో, టీవీల్లో, పత్రికల్లో వార్తల రాయిస్తే ఏం చేశారు. రేవంత్ రెడ్డి మీద కూడా అధికారులు విచారణ జరిపించాలని అన్ని విషయాలు బయటకు రావాలన్నారు.

# థాయ్ మసాజ్ ప్రత్యేకత ఏమిటో మీకు తెలుసా?



థాయ్ మసాజ్ ప్రపంచ వ్యాప్తంగా చాలా ప్రసిద్ధి చెందిన చికిత్సా విధానం. ఇది శతాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయ పద్ధతి. థాయిలాండ్‌కు వెళ్లిన చాలామంది తప్పక ఈ మసాజ్ చేయించుకుంటారు. ఎందుకంటే థాయ్ మసాజ్ అనేది కేవలం విశ్రాంతి కోసం మాత్రమే కాదు.. శరీరం – మనస్సు రెండింటికీ మేలు చేసే విధానం.

#### థాయ్ మసాజ్ ప్రత్యేకత..

థాయ్ మసాజ్ ఇతర మసాజ్‌లకు భిన్నంగా ఉంటుంది. ఇందులో నూనె ఎక్కువగా ఉపయోగించరు. ఇది యోగా లాంటి సాగదీతలతో చేసే చికిత్స. థాయ్ మసాజ్ అనేది నేలపై పరుపు వేసుకుని, వదులుగా ఉండే బట్టలతో చేసే ఒక సాంప్రదాయ యోగా మసాజ్. ఇందులో నిపుణులు చేతులు, మోచేతులు,
మోకాళ్లు, కాళ్లతో శరీరంపై ఒత్తిడి కలిగిస్తూ, యోగా తరహాలో శరీరాన్ని సాగదీస్తారు. ఇది శరీర శక్తి ప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది.

#### థాయ్ మసాజ్ వల్ల ఉపయోగాలు

కండరాల నొప్పులు తగ్గుతాయి
మెడ, భుజాలు, వెన్ను నొప్పులకు ఉపశమనం
శరీరంలోని ఒత్తిడి తగ్గుతుంది
రక్త ప్రసరణ మెరుగుపడుతుంది
మానసిక ప్రశాంతత లభిస్తుంది
మంచి నిద్ర వస్తుంది


శరీరంలో శక్తి సరిగా ప్రవహించకపోతే అలసట, నొప్పులు వంటివి రావడం సహజం. థాయ్ మసాజ్ ఈ శక్తి ప్రవాహాన్ని సరిచేస్తుందని నిపుణులు అంటున్నారు. ఇది సెరోటోనిన్, డోపమైన్ వంటి హ్యాపీ హార్మోన్లను పెంచడంలో కూడా సాయపడుతుంది. అయితే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్నవారు డాక్టర్‌ను సంప్రదించిన తర్వాతే ఈ మసాజ్ చేయించుకోవాలి.

#### థాయ్ మసాజ్ రకాలు..

థాయ్ మసాజ్‌లో పలు రకాలు ఉన్నాయి. సంప్రదాయ పద్ధతిలో శరీరాన్ని పూర్తిగా సాగదీసే మసాజ్, నూనెతో చేసే ఆయిల్ థాయ్ మసాజ్, మూలికలతో చేసే హెర్బల్ థాయ్ మసాజ్, అలాగే, ఫుట్ రిఫ్లెక్సాలజీ వంటి రకాలుంటాయి.

థాయ్ మసాజ్ బ్యాంకాక్, పట్టాయా వంటి ప్రాంతాల్లో విస్తృతంగా అందుబాటులో ఉంటుంది. థాయిలాండ్‌లో ఉపయోగించే కరెన్సీని భట్ అంటారు. భట్ విలువ భారత రూపాయితో పోలిస్తే ఎక్కువగా ఉంటుంది. అందుకే అక్కడ థాయ్ మసాజ్ ధర స్థానికులకు గంటకు సుమారు 260 భట్స్(భారత కరెన్సీలో సుమారు రూ.750 నుంచి రూ.800 వరకు) ఉండగా.. విదేశీయులకు 400 నుంచి 500 భట్స్(సుమారుగా రూ.1100 – రూ.1500) వరకు వసూలు చేస్తారు.

# పానిక్ అటాక్‌ని ఎలా గుర్తించాలో తెలుసా?



ఈ రోజుల్లో చాలా మందికి పానిక్ అటాక్స్ వస్తున్నాయి. కానీ చాలా మంది దీనిని చిన్న ఆందోళనగా భావించి పట్టించుకోరు. నిజానికి, పానిక్ అటాక్‌ని తొందరగా గుర్తిస్తే సరైన చికిత్స తీసుకుని, త్వరగా కోలుకోవచ్చు. అయితే అసలు పానిక్ అటాక్ అంటే ఏమిటి? అది ఎందుకు వస్తుంది? దానిని ఎలా గుర్తించాలి? అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం..

#### పానిక్ అటాక్ అంటే ఏమిటి?

ఆరోగ్య నిపుణుల ప్రకారం, పానిక్ అటాక్ అంటే ఒక్కసారిగా తీవ్రమైన భయం, గుబులు, ఆందోళన రావడం. ఇది కొన్ని నిమిషాల నుంచి అరగంట వరకూ ఉండొచ్చు. ఆ సమయంలో మనకు మనపై నియంత్రణ లేకపోయినట్టు అనిపిస్తుంది.

#### పానిక్ అటాక్ ఎందుకు వస్తుంది?

ఎక్కువ మానసిక ఒత్తిడి
అతిగా ఆలోచించడం
భయంకరమైన అనుభవాలు
దీర్ఘకాలిక టెన్షన్
కొన్నిసార్లు కుటుంబ వారసత్వ కారణాలు

కొంతమందికి స్పష్టమైన కారణం లేకుండానే కూడా పానిక్ అటాక్ రావచ్చు.

పానిక్ అటాక్ లక్షణాలు

పానిక్ అటాక్ లక్షణాలు ఒక్కసారిగా మొదలవుతాయి. ఉదాహరణకు:

గుండె వేగంగా కొట్టుకోవడం
శ్వాస తీసుకోవడం కష్టంగా అనిపించడం
ఛాతీలో బిగుతు
తల తిరగడం
చేతులు, కాళ్లు వణకడం
ఎక్కువగా చెమట పడటం
మూర్ఛ వస్తుందేమో అన్న భయం
చనిపోతామేమో అన్న ఆలోచన

ఈ లక్షణాలు కొంతసేపటికి తగ్గిపోతాయి కానీ మనసుపై ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

#### పానిక్ అటాక్ రాకుండా ఉండాలంటే?

ఒత్తిడిని తగ్గించుకోవడానికి ప్రయత్నించండి
రోజూ కొంచెం వ్యాయామం లేదా యోగా చేయండి
7- 8 గంటలు నిద్రపోండ్
కాఫీ, టీ లాంటివి ఎక్కువగా తాగొద్దు

గుబులుగా అనిపించినప్పుడు నెమ్మదిగా లోతుగా శ్వాస తీసుకోండి

సమస్య మళ్లీ మళ్లీ వస్తే తప్పకుండా మానసిక వైద్యుడిని సంప్రదించండి

పానిక్ అటాక్ ఒక వ్యాధి కాదు, కానీ సరైన శ్రద్ధ అవసరమైన సమస్య. భయపడకుండా సరైన సమాచారం తెలుసుకోవడం చాలా ముఖ్యం.

# అండమాన్ దీవుల పేరును “ఆజాద్ హిందూ’గా మార్చాలి”



మొదటి పేజీ తరువాయి

శక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నేతలు, జాగృతి నాయకులు పాల్గొన్నారు. నివాళుల అనంతరం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నేతలతో కవిత సమావేశమయ్యారు. అండమాన్–నికోబార్ దీవుల పేరును మార్చి ‘ఆజాద్ హిందూ’గా నామకరణం చేయాలన్న ఫార్వర్డ్ బ్లాక్ డిమాండ్‌కు తెలంగాణ జాగృతి సంపూర్ణ మద్దతు ఇస్తుందని కవిత స్పష్టం చేశారు. ఈ డిమాండ్‌కు సంబంధించి ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాసినట్లు వెల్లడించారు.

#### ట్విట్టర్‌లో హ్యాష్‌ట్యాగ్ ఉద్యమం

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ అండమాన్ నికోబార్ అనే పేరు బ్రిటిష్ పాలకులు పెట్టినదని, వారి గుర్తింపును కొనసాగించకుండా దేశ స్వాతంత్ర్య పోరాటానికి ప్రాణం పెట్టిన నేతాజీ పేరును ఆ దీవులకు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26న దేశవ్యాప్తంగా ట్విట్టర్‌లో హ్యాష్‌ట్యాగ్ ఉద్యమం నిర్వహిస్తామని, జాగృతి నెట్‌వర్క్ ద్వారా అన్ని రాష్ట్రాల్లో ఈ డిమాండ్‌ను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం జనవరి 26న నేతాజీ గౌరవార్థం అండమాన్ పేరు మారుస్తుందని ఆశిస్తున్నట్లు కవిత పేర్కొన్నారు. స్వాతంత్రం అడిగితే రాదని, తీసుకోవాలని నేతాజీ చెప్పిన మాటలను గుర్తు చేశారు. యువత రక్తం ఇస్తే స్వాతంత్రం తెస్తానని ఆయన ఇచ్చిన పిలుపు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఉన్నత కుటుంబంలో పుట్టి, ఐఏఎస్‌లో నాలుగో ర్యాంక్ సాధించినప్పటికీ బ్రిటిష్ ప్రభుత్వానికి పని చేయలేనని ఆ పదవిని వదిలేసి ఆజాద్ హిందూ ఫౌజ్‌ను స్థాపించిన నేతాజీ త్యాగాన్ని కవిత కొనియాడారు.

#### ఝాన్సీ లక్ష్మీభాయ్ రెజిమెంట్‌ను ఏర్పాటు

మహిళలకు సైన్యంలో అవకాశం కల్పించి ఝాన్సీ లక్ష్మీభాయ్ రెజిమెంట్‌ను ఏర్పాటు చేసిన నేతాజీ దూరదృష్టిని కవిత గుర్తు చేశారు. నేటికీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంలో ప్రభుత్వాలు ఆలస్యం చేస్తున్నాయని విమర్శించారు. నేతాజీ దేశం గర్వించదగ్గ మహానాయకుడని, ఆయన లెగసీని కాపాడుకోవాలంటే అండమాన్ –నికోబార్ దీవులకు తప్పకుండా ‘ఆజాద్ హిందూ’ అనే పేరు పెట్టాల్సిందేనని కవిత డిమాండ్ చేశారు. గతంలో రాజకీయ లబ్ధి కోసం హైదరాబాద్ పేరు మార్పు హామీలు ఇచ్చిన బీజేపీ, నేతాజీ వంటి మహానాయకుల విషయంలో మాత్రం చిత్తశుద్ధితో ముందుకు రావాలని ఆమె కోరారు.

# సింగరేణిలో పదేళ్ల టెండర్లపై విచారణ జరపాలి

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఎంపీ చామల లేఖ


### పదేళ్ల లావాదేవీలన్నీ బయటకు తీయాలని డిమాండ్



తెలంగాణ బ్యూరో, జనవరి 23 (తీన్మార్ న్యూస్): సింగరేణి పరిధిలోని నైని బొగ్గు క్షేత్రానికి సంబంధించిన టెండర్‌పై వివాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపేందుకు కేంద్ర బొగ్గు గనుల శాఖ సాంకేతిక కమిటీని సైతం ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలోనే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. సింగరేణిలో 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని టెండర్లపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నైనీ కోల్ బ్లాక్ విషయంలో తలెత్తిన వివాదంపై తక్షణమే స్పందించి ఇద్దరు సభ్యులతో కూడిన బృందాన్ని విచారణకు వేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కేవలం నైనీ కోల్ బ్లాక్ టెండర్ రద్దు అంశానికే ఈ విచారణను పరిమితం చేయవద్దని సూచించారు. సింగరేణిలో గడిచిన పదేళ్ల కాలంలో జరిగిన అన్ని టెండర్లు, అధికారిక ప్రక్రియలపై సమగ్ర విచారణ జరిపించాలని లేఖలో పేర్కొన్నారు. గత పదేళ్లుగా జరిగిన టెండర్ల కేటాయింపుల్లో ఎలాంటి అవకతవకలు జరిగాయో తెలంగాణ ప్రజలకు తెలియజేయాలని కోరారు. సింగరేణి లాంటి ప్రతిష్టాత్మక ప్రభుత్వ రంగ సంస్థలో పారదర్శకత, ప్రజాహితాన్ని కాపాడటం అత్యంత అవసరం అని పేర్కొన్నారు.

# మన శంకర వరప్రసాద్ గారు “టికెట్ ధర పెంపుపై హైకోర్టు సీరియస్”



మొదటి పేజీ తరువాయి

జీఎస్టీ అధికారులను తెలంగాణకోర్టు ఆదేశించింది. ఈ సినిమాకు టికెట్ ధరలు పెంపు అక్రమం అని అందువల్ల ఈ సినిమా అక్రమ సంపాదించిన రూ.45 కోట్లను రికవరీ చేయాలని డాక్టర్ పాదూరి శ్రీనివాస రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ పై శుక్రవారం హైకోర్టు విచారణ జరిపింది. చట్టవిరుద్ధంగా ఈ సినిమా టికెట్ ధరలు పెంచారని అందువల్ల ఈ సినిమా ఆర్జించిన రూ. 42 కోట్లను ప్రతివాదులు సంయుక్తంగా లేదా వ్యక్తిగతంగా రాష్ట్ర ప్రభుత్వ సంచిత నిధికి లేదా హైకోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపిన హైకోర్టు ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. అలాగే దీనిని గతంలో దాఖలైన పుష్ప–2, గేమ్ ఛేంజర్, అఖండ–2, రాజా సాబ్ వంటి సినిమాల టికెట్ ధరల పిటిషన్లతో కలిపి తదుపరి వాయిదా విచారిస్తామని పేర్కొంది.

# టీమిండియా సూపర్ విక్టరీ

**కివీస్ బౌలర్లను ఉతికారేశారు!**

**న్యూజిలాండ్‌తో రెండో టీ20లో భారత్ 7 వికెట్ల తేడాతో విజయం**

**209 పరుగుల భారీ లక్ష్యాన్ని 15.2 ఓవర్లలోనే ఛేదించిన టీమిండియా**

**విధ్వంసకర ఇన్నింగ్స్‌లు ఆడిన ఇషాన్ కిషన్ (76), సూర్యకుమార్ (82)**

**ఈ విజయంతో టీ20 సిరీస్‌లో టీమిండియా 2-0తో ఆధిక్యం**

**తొలుత కివీస్ 208 పరుగులు.. కెప్టెన్ శాంట్నర్ మెరుపు ఇన్నింగ్స్**







న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో టీమిండియా అద్భుతమైన విజయాన్ని నమోదు చేసింది. రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన ఈ పోరులో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (82లి), వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ (76) సృష్టించిన విధ్వంసానికి కివీస్ బౌలర్లు చేతులెత్తేశారు. ప్రత్యర్థి నిర్దేశించిన 209 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ కేవలం 15.2 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఈ గెలుపుతో 5 మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అనంతరం 209 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన భారత్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సంజూ శాంసన్ (6), అభిషేక్ శర్మ (0) కేవలం 6 పరుగులకే పెవిలియన్ చేరడంతో జట్టు కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ముఖ్యంగా ఇషాన్ కిషన్ తనదైన శైలిలో బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. కేవలం 32 బంతుల్లోనే 11 ఫోర్లు, 4 సిక్సర్ల సహాయంతో 76 పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు 122 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పి భారత విజయాన్ని ఖాయం చేశారు.

ఇషాన్ నిష్క్రమణ తర్వాత క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే (18 బంతుల్లో 36 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్సులు) కూడా దూకుడుగా ఆడటంతో భారత్ మరో 28 బంతులు మిగిలి ఉండగానే సునాయాసంగా విజయాన్ని అందుకుంది. చివరి వరకు క్రీజులో నిలిచిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 37 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 82 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కివీస్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ, జాకబ్ డఫ్ఫీ, ఇష్ సోధీ తలో వికెట్ దక్కించుకున్నారు.

అంతకుముందు, ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 208 పరుగుల భారీ స్కోరు సాధించింది. కివీస్ ఇన్నింగ్స్‌లో రచిన్ రవీంద్ర (26 బంతుల్లో 44; 2 ఫోర్లు, 4 సిక్సులు) టాప్ స్కోరర్‌గా నిలవగా, ఆఖర్లో కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (27 బంతుల్లో 47 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు ఇన్నింగ్స్‌తో జట్టు స్కోరును 200 పరుగులు దాటించాడు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 35 పరుగులిచ్చి 2 వికెట్లతో రాణించగా, హార్దిక్ పాండ్యా, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి, శివమ్ దూబే తలో వికెట్ పడగొట్టారు.

# భారత్‌కు రాకపోతే బంగ్లాదేశ్‌కు రూ.240 కోట్ల నష్టం!




భారత్ వేదికగా జరిగే ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో పాల్గొనబోమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ)స్పష్టం చేసింది. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని లేదంటే టోర్నీ నుంచి తప్పుకుంటామని తేల్చేసింది. భద్రత కారణాల దృష్ట్యా తమ జట్టును భారత్‌కు పంపే ప్రసక్తే లేదని బీసీబీ ప్రకటించింది. దాంతో బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్ బరిలోకి దిగేందుకు మార్గం సుగుమమైంది. త్వరలోనే ఈ వ్యవహారంపై ఐసీసీ అధికారిక ప్రకటన చేయనుంది. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అనాలోచిత నిర్ణయంతో ఆ దేశ క్రికెట్ మనుగడనే ప్రశ్నార్థకంగా మారింది. బంగ్లాదేశ్ ప్రభుత్వ ఒత్తిడితో తీసుకున్న ఈ నిర్ణయంతో బీసీబీకి భారీ ఆర్థిక నష్టం వాటిల్లనుంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ నుంచి బంగ్లాదేశ్ తప్పుకుంటే ఆ దేశ బోర్డు రూ. 240 కోట్ల వరకు నష్టపోయే అవకాశం ఉంది. బంగ్లాదేశ్ కరెన్సీలో ఇది దాదాపు రూ.325 కోట్లతో సమానం. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఐసీసీ సభ్య దేశాలకు ఏటా ఇచ్చే ఆదాయ వాటాలో బంగ్లాదేశ్‌కు రావాల్సిన మొత్తాన్ని నిలిపేసే అవకాశాలు ఉన్నాయి. ఇది ఆదేశ క్రికెట్ బోర్డును స్తంభింపజేసే ప్రమాదం ఉంది.ఐసీసీ నుంచి రావాల్సిన బ్రాడ్ కాస్టింగ్ ఆదాయంలోని వాటాతో పాటు మొత్తం 60 శాతం ఆదాయాన్ని కోల్పోనుంది. ప్రపంచకప్ వంటి పెద్ద టోర్నీలను బహిష్కరిస్తే ఆ జట్టు స్పాన్సర్లు కూడా తప్పుకోనున్నారు. ఇది ఆ దేశ క్రికెట్ బోర్డు ఆర్థిక స్థితిని దెబ్బతీయనుంది.బంగ్లాదేశ్ తాజా నిర్ణయంతో ఆగస్ట్, సెప్టెంబర్‌లో భారత్‌తో జరగాల్సిన ద్వైపాక్షిక సిరీస్ కూడా రద్దు కానుంది. ఈ సిరీస్ ద్వారా బీసీబీకి బ్రాడ్ కాస్టింగ్ రైట్స్ ద్వారా భారీ ఆదాయం సమకూరే అవకాశం ఉండేది. ఇతర జట్లతో 10 మ్యాచ్‌లు ఆడటం ద్వారా వచ్చే ఆదాయం భారత్‌తో జరిగే ఒక సిరీస్‌లోనే లభిస్తుంది. ఇప్పుడు అది కూడా బంగ్లా క్రికెట్ బోర్డు కోల్పోనుంది. బంగ్లాదేశ్ ప్రభుత్వ క్రీడా సలహాదారుడు ఆసిఫ్ నస్రుల్ భారత్‌కు వెళ్లే ప్రసక్తే లేదని స్పష్టం చేశాడు. ఈ విషయమై మాజీ క్రికెటర్లు అతన్ని కలిసినా ప్రయోజనం లేకపోయింది. సీనియర్ ఆటగాళ్లెవరూ ఈ వ్యవహారంపై మాట్లాడటం లేదు. ముఖ్యంగా తమీమ్ ఇక్బాల్ వంటి గొప్ప ఆటగాళ్లకే గౌరవం దక్కని పరిస్థితుల్లో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మాట్లాడటం సరికాదని వారు భావిస్తున్నారు. ప్రపంచకప్ ఆడకపోయినా.. ఆటగాళ్లకు మ్యాచ్ ఫీజులు అందజేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. కానీ అంతర్జాతీయ స్థాయిలో ఆడే ఆటగాళ్లకు డబ్బు ఒక్కటే లక్ష్యం కాదు. ప్రపంచ వేదికపై తమ నైపుణ్యాలను నిరూపించుకోవడమే ముఖ్యం. ఈ క్రమంలోనే ప్రభుత్వ నిర్ణయంపై బంగ్లా ఆటగాళ్లు అసంతృప్తిగా ఉన్నారు. రాజకీయ కారణాలతో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తీసుకున్న నిర్ణయం .. ఆ దేశ క్రికెట్‌ను చాలా ఏళ్ల పాటు వెనక్కి నెట్టివేస్తుందని క్రికెట్ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

## బంగ్లాదేశ్ విషయంలో జై షా సంప్రదింపులు

2026 పురుషుల టీ20 ప్రపంచ కప్ కోసం బంగ్లాదేశ్ జట్టు భారత్‌లో పర్యటించకుంటే అంతర్జాతీయ క్రికెట్ మండలి చైర్మన్ జై షా కఠిన చర్యలు తీసుకునే ఆలోచనలో ఉన్నారని ఐసీసీ వర్గాలు తెలిపాయి. ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకునే విషయంపై ఐసీసీ చైర్మన్ దుబాయ్ వేదికగా సంప్రదింపులు జరుపుతున్నట్లు వివరించాయి. బంగ్లాలో హిందువులపై నేరాలు పెరిగిన వేళ బీసీసీఐ సూచనతో ఇటీవల బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్?ను ఐపీఎల్ 2026 జట్టు నుంచి కేకేఆర్ తొలగించింది. అప్పటినుంచి భారత్?పై బీసీబీ అక్కసు పెంచుకుంది. తమ ఆటగాళ్లకు భద్రతాపరమైన సమస్యలు ఉన్నాయనీ టీ20 ప్రపంచకప్ మ్యాచ్?లను భారత్ వెలుపల శ్రీలంకలో నిర్వహించాలని కోరగా ఐసీసీ ఆ అభ్యర్థనను తిరస్కరించింది. భారత్?లో బంగ్లా జట్టు, మ్యాచ్ వేదికలకు బీసీబీ చెప్పినట్లు ఎలాంటి ముప్పు గుర్తించలేదని ఐసీసీ పేర్కొంది. ఐసిసి విజ్ఞప్తిని తిరస్కరించిన తర్వాత స్పందించిన బీసీబీ చీఫ్ అమినుల్ ఇస్లాం భారత్?లో ఆడలేమని మరోసారి తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో ఐసీసీ చీఫ్ జైషా నిర్ణయం ఏ నిర్ణయం తీసుకుంటారోన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

# రోహిత్ ఖాతాలో మరో అరుదైన ఘనత!



భారత క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కీర్తికిరీటంలో మరో అరుదైన మైలురాయి చేరింది. ముంబైలోని అజింక్య డీవై పాటిల్ యూనివర్సిటీ తమ 10 స్నాతకోత్సవ వేడుకల్లో భాగంగా రోహిత్ శర్మకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. క్రికెట్ రంగానికి ఆయన చేసిన అసమాన సేవలు, అద్భుతమైన నాయకత్వ పటిమను గుర్తిస్తూ విశ్వవిద్యాలయం ఈ గౌరవాన్ని అందించింది. యూనివర్సిటీ ప్రెసిడెంట్, ఛాన్సలర్ డాక్టర్ అజింక్య డీవై పాటిల్ సమక్షంలో ఈ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. 'అభిమానులు ఆయనను క్రికెట్ 'హిట్‌మ్యాన్'గా పిలుచుకుంటారు, కానీ ఈ రోజు రోహిత్ శర్మ జీవితంలో ఒక భిన్నమైన మైలురాయి. పట్టుదల, వ్యూహరచన వంటి విలువలకు రోహిత్ నిదర్శనం. 2026 గ్రాడ్యుయేటింగ్ విద్యార్థులకు ఆయన ప్రయాణం ఒక గొప్ప స్ఫూర్తి' అని పేర్కొంది.38 ఏళ్ల రోహిత్ శర్మ ఇటీవలే టెస్టులు, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినప్పటికీ.. వన్డే ఫార్మాట్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తూనే ఉన్నారు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టుకు ఐదు ఐపీఎల్ టైటిళ్లను అందించి, లీగ్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా నిలిచారు.రోహిత్ నాయకత్వంలో టీమ్ ఇండియా 2024 టీ20 ప్రపంచ కప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీలను కైవసం చేసుకుని ప్రపంచ క్రికెట్‌లో ఆధిపత్యాన్ని చాటింది. విరాట్ కోహ్లీ తర్వాత కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన రోహిత్.. భారత వైట్ బాల్ క్రికెట్ శైలిని పూర్తిగా మార్చేశారు. జట్టులో దూకుడును పెంచడంతో పాటు ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని నింపడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. స్టేడియంలో ఎంతటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా ప్రశాంతంగా ఉంటూ నిర్ణయాలు తీసుకోవడం రోహిత్ శర్మ ప్రత్యేకత. రోహిత్ శర్మకు ఈ డాక్టరేట్ దక్కడం పట్ల ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బుమ్రా గాయంపై ఊహాగానాలు!?

భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న టీ20 సిరీస్‌లోని రెండో మ్యాచ్ రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ స్టేడియంలో జరుగుతోంది. ఈ మ్యాచ్ కోసం భారత ప్లేయింగ్ ఎలెవన్‌లో జస్ప్రీత్ బుమ్రాను తొలగించారు. అతని స్థానంలో హర్షిత్ రాణాకు అవకాశం ఇచ్చారు. బుమ్రాను తప్పించడంతో, 2026 టీ20 ప్రపంచ కప్‌కు ముందు భారత దిగ్గజ ఫాస్ట్ బౌలర్ గాయపడ్డాడా అని అభిమానులు ఆందోళన చెందుతున్నారు. గత బుధవారం నాగ్‌పూర్‌లో జరిగిన సిరీస్‌లోని మొదటి టీ20 లో బుమ్రా భారత ప్లేయింగ్ చీఎలో భాగమవడం గమనించదగ్గ విషయం. అయితే, ఆ మ్యాచ్‌లో అతనికి వికెట్ దక్కలేదు. అతను తన పూర్తి నాలుగు ఓవర్లు కూడా బౌలింగ్ చేయలేదు. అతను మూడు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేశాడు, ఇది అతని గాయం గురించి ప్రశ్నలను లేవనెత్తింది. రాయ్‌పూర్‌లో టాస్ తర్వాత, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ బుమ్రాకు విశ్రాంతి ఇచ్చామని, ప్లేయింగ్ 11లో లేదని ప్రకటించాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను పరిగణనలోకి తీసుకుంటే, బుమ్రాకు విశ్రాంతి ఇచ్చారు. అతను టీ20 ప్రపంచ కప్‌లో భారతదేశానికి కీలక ఆటగాడిగా ఉంటాడు. హర్షిత్ రాణాతోపాటు, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కూడా ప్లేయింగ్ ఎలెవన్ లోకి తిరిగి వచ్చాడు. మొదటి టీ20లో గాయపడి మైదానం నుంచి నిష్క్రమించిన అక్షర్ పటేల్ స్థానంలో కుల్దీప్ వచ్చాడు. ఈ సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో టీం ఇండియా 48 పరుగుల తేడాతో ఘన విజయం సాధించడం గమనించదగ్గ విషయం. మొదట బ్యాటింగ్ చేసిన టీం ఇండియా 20 ఓవర్లలో 7 వికెట్లకు 238 పరుగులు చేసింది. ఇది టీ20ల్లో న్యూజిలాండ్‌పై భారత్ సాధించిన అత్యధిక స్కోరు. దీనికి ప్రతిస్పందనగా, కివీస్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 190 పరుగులు మాత్రమే చేయగలిగింది. తద్వారా, మెన్ ఇన్ బ్లూ జట్టు తొలి టీ20ని గెలుచుకుని సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది.



## నిరాశగా ముగిసిన బాబర్ అజామ్ బీబీఎల్ ప్రయాణం



పాకిస్తాన్ మాజీ కెప్టెన్ బాబర్ అజామ్ బిగ్ బాష్ లీగ్‌లో అత్యంత ఖరీదైన విదేశీ ఆటగాడిగా సిడ్నీ సిక్సర్స్‌లో చేరిన సంగతి తెలిసిందే. అయితే, బాబర్ తనకు లభించిన జీతానికి సమానమైన ప్రదర్శన ఇవ్వలేకపోయాడు. దీని కారణంగా, బాబర్ ఈ లీగ్‌లో చాలా అవమానాన్ని చవిచూడాల్సి వచ్చింది.బిగ్ బాష్ లీగ్‌లో తొలిసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న బాబర్ చాలా పేలవమైన ప్రదర్శనతో నిరా. బాబర్ ప్రతి పరుగు సాధించడానికి ఇబ్బంది పడాల్సి వచ్చింది. పేలవమైన ఫామ్, జాతీయ జట్టులో చేరడం కారణంగా, బాబర్ సీజన్ మధ్యలో లీగ్ నుంచి నిష్క్రమించాడు. ఫలితంగా, బాబర్ చేసిన ప్రతి పరుగుకు సిడ్నీ సిక్సర్స్ లక్షలాది రూపాయలు చెల్లించాల్సి వచ్చింది.మీడియా నివేదికల ప్రకారం, బాబర్ ఆజం సిడ్నీ సిక్సర్స్ ఫ్రాంచైజీ ద్వారా ఎ÷-లాటినం కాంట్రాక్టుపై సంతకం చేశాడు. దీని ప్రకారం, బాబర్ దాదాపు 2.35 కోట్ల భారతీయ రూపాయల జీతం పొందుతాడు. ఒక విదేశీ ఆటగాడికి ఇచ్చిన అతిపెద్ద ప్యాకేజీ ఇది. బాబర్ ఆజం సిడ్నీ సిక్సర్స్ తరపున 11 మ్యాచ్‌లు ఆడి మొత్తం 202 పరుగులు చేశాడు. అతని సగటు 22.44, స్ట్రైక్ రేట్ 103.06గా ఉంది. ఇందులో రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అయితే, అన్ని మ్యాచ్‌లలో అతని నెమ్మదిగా బ్యాటింగ్ చేయడం చాలా విమర్శలకు దారితీసింది. బాబర్ నెమ్మదిగా బ్యాటింగ్ చేయడం జట్టును ఒత్తిడిలోకి నెట్టింది.ఇది మాత్రమే కాదు, కొన్ని మ్యాచ్‌లలో, బాబర్ ముందుగానే వికెట్లు పారేసుకున్నాడు. అలాగే, తన నెమ్మదిగా బ్యాటింగ్‌తో జట్టుపై ఒత్తిడి పెంచాడు. ఇవన్నీ ఉన్నప్పటికీ, బాబర్‌కు ప్రతి పరుగుకు దాదాపు రూ. 1.26-1.27 లక్షల జీతం లభిస్తుంది. చాలా విమర్శలకు గురైన బాబర్, తన స్ట్రైక్ రేట్ కారణంగా చర్చనీయాంశంగా మారాడు. ఇది మాత్రమే కాదు, స్టీవ్ స్మిత్ స్ట్రైక్ ఇవ్వడానికి నిరాకరించడం కూడా వివాదాన్ని సృష్టించింది. వీటన్నిటీ మధ్య, సీజన్ మధ్యలో జట్టును విడిచిపెట్టిన బాబర్‌కు బీబీఎల్ తదుపరి ఎడిషన్‌లో ఆడే అవకాశం లభించకపోవచ్చు.

# మందు డైలాగ్‌లతో రీల్స్ తగవన్న అనిల్ రావిపూడి



మన శంకర వర ప్రసాద్ గారు' సినిమాలోని మధుపానం.. ధనాధన్' డైలాగ్ ఎంతటి సంచలనం సృష్టించిందో మనందరికీ తెలిసిందే, అయితే ఈ క్రేజ్‌ను చూసి మురిసిపోవాలా లేక ఆందోళన చెందాలా అన్న సందిగ్ధంలో ఉన్నామని అనిల్ రావిపూడి తన మనసులోని మాటను బయటపెట్టారు. చిరంజీవి ఆ డైలాగ్ చెప్పిన తీరుకు అభిమానులు ఫిదా అయ్యారు, అయితే ఆ క్రేజ్‌ను కొందరు నెటిజన్లు, చిన్నారులతో కూడా అలాంటి రీల్స్ చేయించడం ఇబ్బందికరంగా మారింది. దీనిపై అనిల్ రావిపూడి స్పందిస్తూ మన శంకర్ వర ప్రసాద్ గారు (చిరంజీవి) ఎప్పుడూ క్రమశిక్షణకు మారుపేరని, ఆయన సినిమాలోని డైలాగులను తప్పుడు మార్గంలో ప్రచారం చేయవద్దని కోరారు. సినిమా డైలాగులు పేలడం, అవి సోషల్ మీడియాలో ట్రెండ్ అవ్వడం సహజం. కానీ, ఒక మద్యపానానికి సంబంధించిన డైలాగ్ చిన్న పిల్లల నోట రావడం, వారు ఆ బాటిళ్లతో రీల్స్ చేయడం అనేది కాస్త ఆలోచించాల్సిన విషయమని అనిల్ రావిపూడి అభిప్రాయపడ్డారు. ఒక డైలాగ్ హిట్ అయినప్పుడు దాన్ని ఎంజాయ్ చేయడంలో తప్పులేదు. కానీ, అది సమాజానికి, ముఖ్యంగా చిన్నారులకు తప్పుడు సంకేతాలు ఇవ్వకూడదు, 'మందు బాటిళ్లతోనే రీల్స్ చేయాలా? టీ గ్లాసులతో చేయండి, కాఫీతో చేయండి.. తప్పులేదు. కానీ ఆల్కహాల్ జోలికి వెళ్లకండి' అని ఆయన సూచించారు. పిల్లలు ఏం చేస్తున్నారు, ఏ రకమైన వీడియోలు చూసి ప్రభావితం అవుతున్నారు అనేది గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేవలం సినిమా ప్రమోషన్ల కోసమే కాకుండా, సామాజిక బాధ్యతతో అనిల్ రావిపూడి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి.



# పచ్చని ప్రకృతిలో ప్రగ్యా జైస్వాల్


కంచె సినిమాతో తనకంటూ ఎంతో ప్రత్యేకమైన పేరు తెచ్చుకున్న హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్. మొదటి సినిమాతోనే తెగ ఆకట్టుకున్న ఈ హీరోయిన్ ఆ తర్వాత ఎన్నో సినిమాలు చేస్తూ టాలీవుడ్ లో.. మంచి పేరు తెచ్చుకుంది. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటో ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. ఈ ఫోటోలో ఆమె పూర్తిగా ప్రకృతి మధ్య.. పచ్చని వాతావరణంలో కనిపిస్తూ... గ్రీన్ కలర్ డ్రెస్‌లో అందానికే అసూయ తెప్పించేలా.. నిలబడుకొని ఫోటోలకు ఫోజు ఇచ్చింది. "నేను అవుట్‌డోర్సీ అని చెప్పినప్పుడు అర్థం ఇదే".. అంటూ క్యాప్షన్ కూడా పెట్టింది. పచ్చని గడ్డి, చెట్ల మధ్య నిలబడి ఉన్న ప్రగ్యా లుక్ చాలా ఫ్రెష్‌గా ఉంది. ఆమె డ్రెస్ రంగు కూడా చుట్టూ ఉన్న ప్రకృతికి బాగా మ్యాచ్ అయింది. ఈ ఫోటోను మౌర్య అనే ఫోటోగ్రాఫర్ తీశారు. ఆమె వేసుకున్న డ్రెస్ మిస్ మోసా అనే బ్రాండ్ నుంచి.. తీసుకోగా.. చెవులకు వేసుకున్న ఆభరణాలు, చేతి ఆభరణాలు రుబాన్స్ బ్రాండ్ చెందినవి. వేళ్లకు ఉన్న ఉంగరాలు అనంతయ బై మణి నుంచి వచ్చాయి. ఈ మొత్తం లుక్‌ను నటాషా బోత్రా స్టైలింగ్ చేశారు. స్టైలింగ్ టీమ్‌గా మిచియెలా, మౌస్మి మిత్ర పని చేశారు. మేకప్‌ను అతిరా థక్కర్ చేశారు. హెయిర్ స్టైలింగ్‌ను అమిత్ ఠాకూర్ చేశారు. ఒక మధ్యప్రదేశ్లో పుట్టిన ప్రగ్యా జైశ్వర్ కెరియర్ విషయానికి వస్తే.. 2014లో తమిళ సినిమా 'విరట్టు'తో ఆమె నటిగా పరిచయం అయ్యారు. అదే ఏడాది హిందీ సినిమా టిటూ ఎంబీఏలో కూడా నటించారు.2015లో వచ్చిన తెలుగు సినిమా కంచె ఆమె కెరీర్‌ను పూర్తిగా మార్చేసింది. ఆ సినిమాలో రాజకుమారి పాత్రలో ఆమె నటనకు మంచి గుర్తింపు వచ్చింది. ఈ సినిమాతో ఆమె ఫిల్మ్‌ఫేర్ బెస్ట్ ఫిమేల్ డెబ్యూ అవార్డు కూడా గెలుచుకున్నారు. తర్వాత నక్షత్రం,అచారి అమెరికా యాత్ర, అఖండ.. వంటి సినిమాల్లో నటించారు. అఖండ ఆమె కెరీర్‌లో పెద్ద హిట్‌గా నిలిచింది. ఇటీవల హిందీలో ఖేల్ ఖేల్ మేన్ సినిమాలో నటించిన ప్రగ్యా.. గత సంవత్సరం బాలకృష్ణ తో డాకు మహారాజ్ సినిమాలో కనిపించింది. ఇక ఈ హీరోయిన్ మళ్లీ తెలుగు సినిమాల్లో ఎప్పుడూ కనిపిస్తుందా అని ఎదురు చూస్తున్నారు అందరూ.



# శశిరేఖ ఫుల్ వీడియో సాంగ్ విడుదల

సంక్రాంతికి విడుదలై, ప్రేక్షకులకు వినోదం పంచిన చిత్రాల్లో 'మన శంకరవరప్రసాద్ గారు' ఒకటి. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన ఈ మూవీ ఇప్పటికే రూ.300 కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ విజయోత్సాహంలో భాగంగా చిత్ర బృందం.. 'శశిరేఖ' ఫుల్ వీడియో సాంగ్ ను శుక్రవారం విడుదల చేసింది. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటకు భీమ్స్ సంగీతం అందించారు. మధుప్రియతో కలిసి పాట కూడా పాడారు.

# మార్చికి మారిన స్వయంభు మూవీ




కార్తీకేయ2తో పాన్ ఇండియా హీరోగా మారిపోయాడు నిఖిల్. కానీ ఆ తర్వాత వేసిన రాంగ్ స్టెప్స్ వల్ల ఇమేజ్ డ్యామేజ్ చేశాయి. 18 పేజెస్ పాజిటివ్ టాక్ తెచ్చుకున్నా పైసల్ రాలేదు. ఇక స్పై, అప్పుడో ఎప్పుడో ఇప్పుడో భారీ డిజాస్టర్స్‌గా నిలవడంతో స్లో అండ్ స్టడీగా మూవీస్ చేస్తున్నాడు. నెక్ట్స్ పీరియాడిక్ వార్ డ్రామా స్వయంభుతో గట్టిగా కొట్టాలని ప్రయత్నిస్తున్నాడు. ఈ సినిమా కోసం గెటప్స్ ఛేంజ్ చేయడమే కాదు దాదాపు రెండేళ్లు ఈ సినిమాకే కమిటయాడు. స్వయంభు 170 రోజుల భారీ షెడ్యూల్ షూట్ కంప్లీట్ చేసుకుని ఈ మధ్యే గుమ్మడికాయ కొట్టేసింది టీం. ఈఏడాది ఫిబ్రవరి13న థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు ఎనౌన్స్ చేశారు. సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్స్. అయితే ఈ సినిమా రిలీజ్ కావడానికి సమయం దగ్గర పడుతున్నా టీం ప్రమోషన్స్ స్టార్ట్ చేయలేదు. జస్ట్ షూట్ కంప్లీటైన వీడియో తప్ప మరో అప్డేట్ లేదు. సంక్రాంతికి పోస్టర్స్ వేసినప్పటికీ.. రిలీజ్ డేట్ మాయం అయ్యింది. స్వయంభును అత్యంత భారీ బడ్జెట్ చిత్రంగా నిర్మిస్తున్నారు ప్రొడ్యూసర్. ఫిబ్రవరిలో స్వయంభు పోస్ట్ పోన్ అవడం పక్క. అయితే నెక్ట్స్ ఏ డేట్ కు వస్తాడనే దానిపై రాకరకలా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అందుతున్న సమాచారం ప్రకారం మార్చి 23 లేదా ఏప్రిల్ 30న రిలీజ్ చేసే ఛాన్సు ఉందని సమాచారం. అటు నిఖిల్ కూడా ఈ సినిమాపై ఎంతో నమ్మకంపెట్టుకున్నాడు. స్వయంభు కోసం చాలా కష్టపడి గుర్రపు స్వారీలు, కత్తి యుద్దలు వంటివి నేర్చుకున్నాడు. మరి నిఖిల్ కు స్వయంభు మరొక పాన్ ఇండియా హిట్ ఇస్తుందో లేదో చూడాలి.



# సునీతా విలియమ్స్‌ను కలిసిన ప్రకాశ్ రాజ్

కేరళలోని కోజికోడ్‌లో జరుగుతున్న సాహిత్య ఉత్సవం (ఒక అపురూప ఘట్టానికి వేదికైంది. భారత సంతతికి చెందిన ప్రముఖ వ్యోమగామి సునీతా విలియమ్స్‌ను దిగ్గజ నటుడు ప్రకాశ్ రాజ్ ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా కలుసుకున్నాడు. ప్రస్తుతం కేరళలో లిటరేచర్ ఫెస్టివల్ జరుగుతుండగా.. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా వచ్చింది సునీత విలియమ్స్. అయితే ఇటీవలే నాసా నుంచి పదవీ విరమణ పొంది భారత పర్యటనకు వచ్చిన సునీతా విలియమ్స్‌తో గడిపిన క్షణాలను ప్రకాశ్ రాజ్ తన సామాజిక మాధ్యమాల ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఈ జనరేషన్ అత్యంత ధైర్యవంతురాలైన మహిళను కలవడం తనకు దక్కిన గొప్ప గౌరవమని, ఈ జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచిపోతాయని ప్రకాశ్‌రాజ్ ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా రాసుకోచ్చాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి.

# ఓ క్రైమ్ థ్రిల్లర్ మూవీ చీకటిలో



థియేటర్‌లో వరుస సినిమాలు అలరిస్తున్నా.. కొన్ని చిత్రాలు ఇప్పటికీ నేరుగా ఓటీటీ వేదికల్లో విడుదలవుతూ ఆసక్తిని పెంచుతున్నాయి. శోభిత ధూళిపాళ్ల కీలక పాత్రలో రూపొందిన తాజా చిత్రం 'చీకటిలో..'. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా నేరుగా విడుదలైంది. నెల్లూరు సంధ్య (శోభిత ధూళిపాళ్ల) ఓ వార్తా ఛానల్‌లో యాంకర్. క్రైమ్ కథనాలను ప్రేక్షకులకు ప్రజెంట్ చేస్తూ ఉంటుంది. టీఆర్పీల కోసం కాకుండా వాస్తవాలను వెల్లడించాలన్నది ఆమె అభిమతం. అందుకు విరుద్ధంగా ఛానల్ వ్యవహరిస్తుండటం తో స్నేహితురాలు బాబీతో(అదితి) కలిసి సొంతంగా పాడ్‌కాస్ట్ ఛానల్ పెట్టాలని నిర్ణయించుకుంటుంది. అదే సమయంలో అమర్‌తో (విశ్వదేవ్ రాచకొండ) ప్రేమలో ఉంటుంది. ఇరు కుటుంబాలు పెళ్లి అంగీకరించిన ఆనందంలో ఉండగా.. బాబీ, అతని బాయ్ ఫ్రెండ్ దారుణంగా హత్యకు గురవుతారు. బాబీని అత్యాచారం చేసి చంపేస్తారు. ఆ హత్య చేసింది వాచ్‌మెన్ అని సంధ్య గుర్తించడంతో కేసు క్లోజ్ అయిపోతుంది. అప్పుడే సంధ్యకు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ వస్తుంది. తనని పట్టుకోలేక, ఓ అమాయకుడిని బలి పశువును చేశారంటూ అసలు హంతకుడు సంధ్యకు చెబుతాడు. దీంతో పోలీస్ ఆఫీసర్ రాజీవ్ (చైతన్య)తో కలిసి సంధ్య ఇన్వెస్టిగేషన్ మొదలు పెడుతుంది. అలా మొదలైన ఆమె ఇన్వెస్టిగేషన్ ప్రయాణం ఎన్ని మలుపులు తీసుకుంది? పాతికేళ్ల కిందట గోదావరి జిల్లాల్లో జరిగిన హత్యలతో ఈ హత్యకు ఉన్న సంబంధం ఏంటి? వీటి వెనుక ఎవరు ఉన్నారన్నది అసలు కథ. క్రైమ్ మిస్టరీ థ్రిల్లర్లు తెలుగు ప్రేక్షకులకు కొత్తేమీ కాదు. వాటిని ఎంత ఆసక్తికరంగా, ఉత్కంఠతో చూపించామన్న దానిపైనే సినిమా విజయం ఆధారపడి ఉంటుంది. 'చీకటిలో' మూవీ కోసం దర్శకుడు శరణ్ కొప్పిశెట్టి ఎంచుకున్న కథా వస్తువుకు పాడ్ కాస్ట్ అనే పాయింట్ జోడించి చెప్పడం కొత్తగా ఉంది. అలాగే చివరి వరకూ హంతకుడు ఎవరో తెలియకుండా సన్నివేశాలను రాసుకున్న తీరూ అలరిస్తుంది. అయితే, కథలో ఉన్న కీలక పాయింట్‌ను బలంగా ప్రజెంట్ చేయలేకపోయారు. పాతికేళ్ల కిందటి హత్యాచార ఘటనతో కథను మొదలు పెట్టిన దర్శకుడు.. ఓ క్రైమ్ థ్రిల్లర్‌ను ప్రేక్షకుడు చూడబోతున్నాడనే హింట్ ఇచ్చేశాడు. టీవీ యాంకర్ నెల్లూరు సంధ్య నేపథ్యం, కుటుంబం, అమర్‌తో ప్రేమ ఇలా ఆమె ప్రపంచాన్ని పరిచయం చేస్తూ కాస్త నెమ్మదిగా కథలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. ఎప్పుడైతే సంధ్య స్నేహితురాలు బాబీ హత్య జరుగుతుందో.. అప్పుడే అసలు కథ మొదలవుతుంది. ఈ క్రమంలో పోలీస్ ఆఫీసర్ రాజీవ్‌తో కలిసి సంధ్య సాగించే ఇన్వెస్టిగేషన్ నెమ్మదిగా సాగుతుంది. ఇదే తరహాలో మరో జంట హత్యకు గురవడంతో కథ, కథనాలు ఆసక్తికరంగా మారతాయి. స్పెషల్ ఆఫీసర్ ఆనందిని (ఇషా చావ్లా) రంగ ప్రవేశంతో కథలో వేగం పెరుగుతుందని అనుకుంటే.. కొత్తదనమేమీ ఉండదు. సంధ్య ఇన్వెస్టిగేషన్ చేస్తుంటే, ఉన్నతాధికారులు సైతం ఆమెను ఫాలో అవ్వడం ఏమంత ఆసక్తికరంగా అనిపించదు. పైగా పోలీసులు పెట్టిన హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి 'మరో హత్య చేసే లోపు నన్ను పట్టుకోండి' అంటూ హంతకుడే సవాల్ విసరడం కాస్త హాస్యాస్పదంగా ఉంటుంది. ఆ హత్యల వెనుక కారణం అంత బలమైనదిగా అనిపించదు. నెల్లూరు సంధ్య పాత్రలో శోభిత ధూళిపాళ్ల న్యాయం చేశారు. చైతన్య, ఇషా చావ్లా, సురేశ్, రవీంద్ర విజయ్, శ్రీనివాస్ వడ్లమాని తమ పాత్రల్లో ఒదిగిపోయారు. సాంకేతికంగా సినిమా బాగుంది. నిడివి కూడా తక్కువే. కథనం నెమ్మదిగా సాగినా.. కథను చివరి వరకూ ఆసక్తికరంగా చూపించడంలో శరణ్ కొప్పిశెట్టి విజయం సాధించారు.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463